విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-68వ క్రీడా పోటీలు ప్రారంభం

క్రీడా పోటీల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, సెప్టెంబర్ 21 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కడ్తాల్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా-68వ క్రీడా పోటీలను అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థులచే ఎమ్మెల్యే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. క్రీడాకారులను ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తున్నదని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయిలో రాణించాలన్నారు.

జోనల్ కార్యదర్శి భీముడునాయక్ మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. విద్యార్థులకు అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన వివరించారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మాధవి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సీఐ శివప్రసాద్, ఎస్‌ఐ వరప్రసాద్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఏంఈవో నాయక్, హెచ్‌ఎం జంగయ్య, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, జోనల్ సెక్రటరీ భీముడునాయక్, పీడీలు, విద్యార్థులున్నారు.

వాలీబాల్ పోటీలో తలపడుతున్న కడ్తాల్-రావిచేడ్ గ్రామాల విద్యార్థులు



హైతాబాద్‌లో ఉచిత వైద్యశిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ

షాబాద్, సెప్టెంబర్ 21 : గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ సురేఖ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో వెల్‌స్పన్ ఫౌండేషన్, భాస్కర దవాఖాన, శ్రీ బాలాజీ దంత వైద్య శాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్లు సాయికృష్ణ, ప్రసన్న గ్రామానికి చెందిన సుమారు 70 మందికి బీపీ, షుగర్, కంటి, దంత, కీళ్లు, సాధారణ వ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

మంచాల, సెప్టెంబర్ 21 : గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిధుల కొరత వలన నిత్యం మానసికంగా ఇబ్బందులు తప్పడం లేదని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మంచాల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో మంచాల ఎంపీడీవో బాలశంకర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు నాగప్ప, వెంకటేశ్, నర్సింహ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అప్పులు చేసి తమ సొంత డబ్బులను ఖర్చు పెట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా నేటికీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి కొన్ని నెలల నుంచి వేతనాలు చెల్లించుటకు నిధులు లేకపోవడంతో పారిశుధ్య పనులు, గ్రామంలో చెత్త సేకరించేందుకు ఉన్న ట్రాక్టర్లకు డీజిల్‌కు కూడా నిధులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. 10 నెలల నుంచి తమకు వచ్చే జీతం డబ్బులను గ్రామపంచాయతీ అవసరాలకు ఖర్చు చేస్తుండటంతో కుటుంబాలను పోషించడం భారంగా మారిందని చెప్పారు. వెంటనే గ్రామపంచాయతీలవారీగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

గూడూరు పంచాయతీలో పెద్దగుట్టతండాను కలుపొద్దు

కొత్తూరు, సెప్టెంబర్ 21 : పెద్దగుట్టతండాను గూడూరు గ్రామపంచాయతీలో కలుపొద్దని గూడూరు ప్రజలు కొత్తూరు ఇన్‌చార్జి ఎంపీడీవో సుమతికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి గూడూరు గ్రామపంచాయతీ నుంచి మక్త గూడ, పెద్దగుట్టతండాను ఒక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. అలాగే మల్లాపూర్‌తండా, లోక్యాతండా, రాగ్యాతండా, కమ్మ తండాలను మరో గ్రామపంచాయతీగా ఏర్పాటు చేశారు. మక్తగూడ గ్రామపంచాయతీకి చెందిన పెద్దగుట్టతండావాసుల్లో కొంత మంది తమ గ్రామానికి వచ్చి తాము గూడూరు పంచాయతీలో కొనసాగుతామని మా ఊరువారితో సంతకాలు పెట్టించుకున్నారు. గూడూరు గ్రామపంచాయతీలో 1700 జనాభా ఉంటుందని తెలిపారు. ఓటర్లు 1250 మంది ఉన్నారని వివరించారు. తమ గ్రామంలో 10 వార్డులు ఉన్నాయని తెలిపారు. ఎవరినీ తమ గ్రామపంచాయతీలో కలుపొద్దని ఎంపీడీవోను కోరారు. పెద్దగుట్టతండావాసులకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని వారు ఎంపీడీవోకు విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసినవారిలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు సురేశ్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, మాజీ వార్డు సభ్యులు ఉన్నారు.

వినాయక పూజలో పాల్గొన్న ఏసీపీ రాజు, సీఐ శంకర్‌కుమార్

వినాయకుడికి పూజలు

యాచారం, సెప్టెంబర్ 21 : మండలంలోని మాల్ మార్కెట్‌లో విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు, యాచారం సీఐ శంకర్‌కుమార్ శనివారం సాయంత్రం పూజలు నిర్వహించారు. అనంతరం బట్టు శ్రీనివాస్ ఏసీపీ, సీఐలను సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ.. యువత భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజ సేవలో భాగస్వాములు కావాలన్నారు. మండలంలో ఇంకా నిమజ్జనం కాని వినాయకుల నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మంచాల, సెప్టెంబర్ 21 : మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంచాల ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం మంచాల మండలం జాపాల అటవీ ప్రాంతంలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఆరుట్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంచాలలోని ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఉమారాణి, అధికారులు పాల్గొన్నారు.

జాపాల అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధికారులు

పౌష్టికాహారంపై జాగ్రత్తలు తీసుకోవాలి

మంచాల, సెప్టెంబర్ 21 : విద్యార్థులు పౌష్టికాహారంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి సీడీపీవో తులసి అన్నారు. శనివారం మంచాలలోని కస్తూర్బా వసతి గృహంలో విద్యార్థులకు పౌష్టికాహారంపై శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి రోజూ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మంచాల వైద్యాధికారి మాన్విత, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలతా రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



బీఆర్ఎస్ కడ్తాల్ గ్రామ నూతన అధ్యక్షుడు కడారి రామకృష్ణకు నియామకపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, సెప్టెంబర్ 21 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా అన్నారు. శనివారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో పరమేశ్ అధ్యక్షతన కడ్తాల్ పట్టణ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కడ్తాల్ గ్రామ బీఆర్ఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కడారి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా గూడెపు మహేశ్, మీడియా కోఆర్డినేటర్‌గా ఎర్రోళ్ల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులకు నాయకులు నియామక పత్రాన్ని అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బూటకపు హామీలపై ప్రజల్లో చర్చ జరపాలని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న నియంత పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన మాయ మాటలను నమ్మి మోసపోయామనే బాధలో ప్రజలున్నారని తెలిపారు. గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లక్ష్మాణాచారి, మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, రైతు బంధు మాజీ అధ్యక్షుడు నర్సింహ, నాయకులున్నారు.

చేవెళ్ల మండల పరిధి దామరగిద్ద ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు స్థానిక నేత ఘనపురం శేఖర్ వాటర్ ఫిల్టర్‌ను డొనేట్ చేశారు. ఈ సందర్భంగా శనివారం దాత తండ్రి బాలయ్య పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. - చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 21



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

ఘనంగా ఉర్సు

షాద్‌నగర్‌రూరల్, సెప్టెంబర్ 21: ఫరూఖ్‌నగర్ మండలంలోని మధులాపూర్ గ్రామంలో హజరత్ సయ్యద్ అబ్దుల్ నబీషాఖాద్రీ రహమత్‌ఉల్లా అలై ఉర్సు షరీఫ్ ఉత్సవాలను శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దట్టీలను కప్పి ప్రత్యేక ప్రార్థనలను చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భార్గవ్ కుమార్‌రెడ్డి, నాయకులున్నారు.

స్వచ్ఛత మనందరి బాధ్యత

ఆమనగల్లు, సెప్టెంబర్ 20 : స్వచ్ఛత మనందరి బాధ్యతని మున్సిపల్ కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఆమనగల్లులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశాన్ని స్వచ్ఛత వైపు నడిపించాలనే సంకల్పంతో ప్రధాని నరేంద్రమోదీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, అధికారులు, ఉపాధ్యాయులున్నారు.

ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చీదేడు గ్రామ రైతులు

దారి ఇవ్వాలి

మంచాల, సెప్టెంబర్ 21 : మంచాల మండలం చీదేడు గ్రామానికి చెందిన రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో సుమారు 50 మంది రైతులు వ్యవసాయం చేయలేక పొలాలను బీడు భూములుగా మార్చుకునే పరిస్థితి ఏర్పడ్డదని, తమ పొలాలకు వెళ్లేందుకు అటవీ భూమి గుండా దారి ఇప్పించాలంటూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి అటవీ శాఖ అధికారులతో మాట్లాడి రైతులకు దారి సౌకర్యాన్ని కల్పించనున్నట్లు హామీ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, గ్రామస్తులు ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు విరాళం అందజేత

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 21 : షాద్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గరుడ, హనుమాన్, శంకు, చక్ర విగ్రహాల ఏర్పాటుకు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మలిపెద్ది శ్రీనివాసులు శనివారం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో శిల్పి మల్లేశ్‌కు విరాళం అందజేశారు. విగ్రహాల ఏర్పాటుకు అయ్యే ఖర్చును విరాళంగా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అంతకు ముందు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు కిశోర్, నాయకులు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 21 : పార్కు చేసి ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చేవెళ్ల మండల పరిధిలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన మల్లేశ్ శనివారం మధ్యాహ్నం బైక్‌ను చేవెళ్లలోని శివాజీ హాస్పిటల్ వెనకాలా పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి ఈ బైక్‌ను తీసుకువెళ్లాడు. ఇది సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. ఈ బైక్‌కు వెనుకా ముందర నెంబర్ ప్లేట్లు లేవు. ఇలాంటి బైక్‌పై ఉన్న వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే చేవెళ్ల పోలీసులకు సమాచారమందించాలని పోలీసులు కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు దొంగలు అరెస్ట్

4 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

కొత్తూరు, సెప్టెంబర్ 21 : తాళం వేసిన ఇంటిని టార్గెట్‌గా చేసి ఇండ్లను గుల్ల చేస్తున్న ఇద్దరు దొంగలను కొత్తూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కొత్తూరు సీఐ నరసింహారావు శనివారం సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ నెల 18న కొత్తూరు మున్సిపాలిటీలోని నారాయణగూడ కాలనీలో బాల నరేంద్ర ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లాడు. అలాగే రింగిదేవి కూడా తను ఉంటున్న అద్దె ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లింది. మధ్యాహ్నాం తాళం వేసిన రెండు ఇండ్లలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదును దొంగిలించుకొనిపోయారు. బాధితులిద్దరు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. కొత్తూరు సీఐ నరసింహారావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఇన్‌స్పెక్టర్ మరళీగౌడ్ తన సిబ్బందితో వెళ్తుండగా కొత్తూరు రైల్వేస్టేషన్ రోడ్డులో బ్యాగ్ వేసుకొని వెళ్తున్న వ్యక్తిపై అనుమానం వచ్చి అతడిని, అతడి వెంట ఉన్న వ్యక్తిని విచారించారు. యూపీకి చెందిన మహమ్మద్ సబీర్(22), ఏపీకి చెందిన షేక్ నూర్(23) అని తెలిసింది. వీరిద్దరిపై ఇతర రాష్ట్రాల్లో కూడా పలు కేసులు ఉన్నాయని విచారణలో తేలింది. వారిని విచారించగా దొంగతనం చేశామని ఒప్పుకొన్నారు. వారి నుంచి 4 తులాల మూడు మాసాల బంగారు ఆభరణాలు, 13 తులాల వెండి, ఒక ఐరన్ రాడ్డు, స్క్రూ డ్రైవర్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. కేసు ఛేదించిన ఎస్‌ఐ మురళీగౌడ్, ఏఎస్‌ఐ శ్రీనివాసచారి, పీసీలు ఎర్ర కుమార్, రవికుమార్‌లను సీఐ నరసింహారావు అభినందించారు.

గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మధుసూదన్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 21 : గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా చిలుక మధుసూదన్‌రెడ్డి శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరు గాంచిన గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన ఎన్నికకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో పాటు ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుకొంటున్నట్లు పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. గడ్డిఅన్నారం మార్కెట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతు సమస్యలను ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు చర్చించి పరిష్కరించేందుకు పాటుపడతానన్నారు. మార్కెట్ అభివృద్ధికి రైతులు, పాలకవర్గం, ప్రజాప్రతినిధులు అన్ని విధాలుగా సహకరించాలని ఆయన కోరారు. అనంతరం ఆయనను పాలకవర్గంతో పాటుగా అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 21 : చేవెళ్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఓపెన్ స్కూల్ సమన్వయకర్త కేవీ సత్యనారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కో-అర్టినేటర్ సుధాకర్, జీటీఏ జిల్లా అధ్యక్షుడు నరసింహతో కలిసి శనివారం ఓపెన్ స్కూల్ అడ్మిషన్ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. అక్టోబర్ 3 వరకు టీఓఎస్ఎస్, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై కారు పల్టీ

మహిళ మృతి

మరో ఇద్దరికి తీవ్రగాయాలు

మృతురాలు శ్రీవల్లి(ఫైల్)

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 21 : అతివేగం ఓ ప్రాణం తీసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో ఓఆర్ఆర్‌పై కారు పల్టీలు కొట్టి ఓ మహిళ మృతిచెందింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన సోపతి శ్రీవల్లి(23) ఈసీఐఎల్‌లో ఉంటున్నది. అక్కడే ఓ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్నది. మరో ఇద్దరితో కలిసి కారులో శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లా నుంచి ఈసీఐఎల్‌కు బయలుదేరారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో ఓఆర్ఆర్‌పై తారామతిపేట వద్ద ఎగ్జిట్ నంబర్ 10 సమీపంలోకి రాగానే 11 గంటల ప్రాంతంలో అతివేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఆ సమయంలో శ్రీవల్లి కారు నుంచి బయటపడి అక్కడికక్కడే మృతిచెందింది. కారులో ఉన్న డ్రైవర్ శివ, అనిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం దవాఖానకు తరలించారు. శ్రీవల్లి మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి.. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్

షాద్‌నగర్, సెప్టెంబర్ 21 : షాద్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డివిజన్ వైద్యారోగ్యశాఖ సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులు ఏ హోదాతో స్టేజిపై కూర్చున్నారో చెప్పాలని, సంబంధిత అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం డివిజన్ వైద్యారోగ్యశాఖ సమీక్షా సమావేశానికి సంబంధించిన వార్తా కథనాలు, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను చూస్తుంటే ఈ కార్యక్రమం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించినట్టు లేదని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తే అధికారులు వెళ్లినట్లు ఉందన్నారు. వైద్యారోగ్యశాఖ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్న స్టేజిపై కాంగ్రెస్ నాయకులు ఏ హోదాలో కూర్చున్నారో అధికారులు వివరించాలన్నారు. ఎమ్మెల్యే, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, స్థానిక అధికారులు పాల్గొన్న సమావేశంలో కనీస నిబంధనలు పాటించకుండా కాంగ్రెస్ నాయకులు డివిజన్ వైద్యారోగ్యశాఖ సమీక్షా సమావేశాన్ని పార్టీ కార్యక్రమంగా నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆశ వర్కర్లను మహిళలు అని చూడకుండా కింద కూర్చోబెట్టి ఆడపడుచులను అవమానపరచడం బాధాకరమన్నారు. నిస్వార్థంగా ప్రజల ఆరోగ్యం కోసం పని చేస్తున్న ఆశాలకు ఇదేనా ఇచ్చే గౌరవమని ప్రశ్నించారు. ఎలాంటి ప్రొటోకాల్ లేకుండా ఇష్టానుసారంగా కాంగ్రెస్ నాయకులు స్టేజిపై కూర్చునేలా సమావేశాన్ని నిర్వహించిన అధికారులందరిపై చర్యలు తీసుకోవాలన్నారు.

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా గడ్డమీది పెంటయ్య గౌడ్

చేవెళ్లటౌన్, సెప్టెంబర్ 21 : చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా గడ్డమీది పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్‌గా బ్యాగరి రాములు నియమితులయ్యారు. సభ్యులుగా కొజ్జంకి సత్యనారాయణ, గోటూరి సుదర్శన్, యాదిరెడ్డి, పడాల లలిత, ఎరుకల బాలయ్య, గణపురం నరేందర్, ఎండీ హనీఫ్, నక్కలపల్లి మల్లేశ్, కురమ యాదయ్య, తుమ్మలపల్లి జనార్దన్, కొత్తగడి వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పెంటయ్య గౌడ్ మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తూ మార్కెట్ వచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. చేవెళ్ల మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 21 : ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం శంకర్‌పల్లి పరిధిలో 11వ వార్డులో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధ